www.arogyajyothi.com

Telugu Daily

# ఆరోగ్యజ్యోతి

వైద్య ఆరోగ్య సమాచార దినపత్రిక

ఎడిటర్ కే. నరేష్ కుమార్

పేజీలు : 4
Pages : 4

వెల : 5
Price: 5

## ప్రజారోగ్యం పట్టదా...!


03

సంపుటి (Volume): 1 సంచిక (Issue) : 190 | Published from: ADILABAD, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | ఆదివారం 5 అక్టోబర్ 2025

# ఆరోగ్యశ్రీలో 99.50లక్షల కుటుంబాలు

- రెండేళ్ల వ్యవధిలో 17% పెరిగిన కేసులు
- 'ప్రైవేటు'లో రోజూ 1200 కేసుల నమోదు
- గతంలో ఈ సంఖ్య 800-950 మాత్రమే
- పథకంలోకి కొత్తగా 9.5లక్షల కుటుంబాలు
- పెరిగిన ప్రొసీజర్లు, ఎంప్యానెల్ ఆస్పత్రులు
- ప్రభుత్వానికి వైద్య, ఆరోగ్య శాఖ నివేదిక



**హైదరాబాద్,(ఆరోగ్యజ్యోతి):** రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కేసుల సంఖ్య రెండేళ్ల వ్యవధిలో 17శాతం పెరిగినట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. 2023 వరకు రోజూ సగటున ప్రైవేటు ఆస్పత్రుల్లో 800-950 మధ్య ఆరోగ్యశ్రీ కేసులు రాగా... ప్రస్తుతం ఆ సంఖ్య 1150-1200కు పెరిగింది. సర్కారీ దవాఖానాల్లోని ఆరోగ్యశ్రీ కేసులను కూడా కలిపితే అది 2200 వరకు వస్తున్నట్లు వైద్యశాఖ పేర్కొంది. ఆరోగ్య శ్రీ పరిధిలోకికొత్తగా మరో పది లక్షల కుటుంబాలు రాగా.. మొత్తం కుటుంబాల సంఖ్య 99.50లక్షలకు చేరింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద ప్రభుత్వం ఇప్పటివరకు రూ.12,890 కోట్లు ఖర్చు పెట్టింది. లబ్ధిదారులు, పెరిగిన ప్రొసీజర్ల సంఖ్య, నెట్‌వర్క్ ఆస్పత్రులు, పెట్టిన ఖర్చు తదితర అంశాలపై తాజాగా ప్రభుత్వానికి వైద్య ఆరోగ్య శాఖ ఓ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో 2014 నుంచి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో చోటుచేసుకున్న మార్పులను వివరించింది. ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస కింద ఇప్పటిదాకా మొత్తం 52.97 లక్షల మంది శస్త్రచికిత్సలు చేయించుకున్నట్లు వెల్లడించింది.

### ఏటా పెరుగుతోన్న రోగులు, ఆస్పత్రులు...

2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు.

మిగతా 2 లో




# ఢిల్లీ ఎయిమ్స్ నంబర్ 1

## తెలుగు రాష్ట్రాలకు నిరాశే

## మొదటి 50ల్లో ఉస్మానియా

**ఢిల్లీ,(ఆరోగ్యజ్యోతి):** దేశంలోనే అత్యుత్తమ వైద్య బోధన సంస్థగా న్యూఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) తన ప్రతిష్ఠను నిలబెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ)లో 91.80 పాయింట్లతో న్యూఢిల్లీ ఎయిమ్స్ దేశంలోనే మొదటి స్థానం దక్కించుకుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు కొంత నిరాశే ఎదురైంది. ఏపీ, తెలంగాణ నుంచి కేవలం ఉస్మానియా వైద్యకళాశాల ఒక్కటే టాప్ 50లో చోటు దక్కించుకుంది. 51.46 పాయింట్లతో ఉస్మానియాకు 48వ ర్యాంకు దక్కింది. గుంటూరు వైద్య కళాశాల 42.10 పాయింట్లు సాధించింది. వైద ్య పరిశోధనలో కొంత వెనుకబడటంతో జీఎంసీ టాప్ 50లో స్థానం పొందలేకపోయింది. దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలకు వాటి పని తీరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ర్యాంకులు ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా వైద్య బోధన సంస్థల మధ్య ఆరోగ్యకరమైన పోటీకి ఈ ర్యాంకులు దోహదపడతాయని, వైద్య విద్యార్థులు కూడా తాము చదివే కళాశాలను ఎంచుకొనేందుకు ఈ ర్యాంకులు తోడ్పడతాయని భావించి ఎన్ఐఆర్ఎఫకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కళాశాలలో బోధన, వైద్య సిబ్బంది పని తీరు, వైద్య పరిశోధనలు, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత తదితర పలు అంశాలను పరిగణలోకి తీసుకొని ర్యాంకులు కేటాయించారు. మొత్తం 100 పాయింట్లకు కనీసం 50 పాయింట్లు

మిగతా 2 లో



# ఆరుగురు చిన్నారుల మృతి

## ఆ దగ్గు సిరప్ అమ్మకాలు బంద్..!


**మధ్యప్రదేశ్ ,(ఆరోగ్యజ్యోతి):** చింద్వారా జిల్లాలో దాదాపు పక్షం రోజుల్లోనే ఆరుగురు పిల్లలు కిడ్నీ ఫెయిల్ అయ్యి మృతి చెందారు. ఈ ఘటన కలకలం సృష్టించింది. దగ్గు సిరప్‌తాగడం వల్లే చిన్నారులు మృతి చెందడం తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కోల్డ్రిఫ్ సిరఫ్ అమ్మకాలను మధ్యప్రదేశ్ వ్యాప్తంగా నిషేధించింది. అలాగే, సిరప్ తయారీ సంస్థ ఇతర ఉత్పత్తులను సైతం నిషేధించేందుకు చర్యలకు ఉపక్రమించిది. చింద్వారాలో కోల్డ్రిఫ్ సిరప్ కారణంగా పిల్లలు ప్రాణాలు కోల్పోయవడం చాలా విషాదకరమని సీఎం డాక్టర్ మోహన్ యాదవ్ అన్నారు. ఈ సిరప్ అమ్మకాలను మధ్యప్రదేశ్ అంతటా నిషేధించినట్లు తెలిపారు. సిరప్ తయారు చేసిన కంపెనీ ఇతర ఉత్పత్తుల అమ్మకాలను సైతం నిషేధించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.సిరప్ తయారీ కర్మాగారం తమిళనాడులోని కాంచీపురంలో ఉంది. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. ఈ విషయంలో దర్యాప్తు చేయాలని తమిళనాడు సర్కారును కోరింది. ఇందుకు సంబంధించిన నివేదిక ప్రభుత్వానికి ఇవాళ ఉదయం అందింది. నివేదిక ఆధారంగా సర్కారు కఠిన చర్యలు తీసుకుంది. పిల్లల మృతి వార్త వెలుగులోకి వచ్చాక ఈ విషయంపై దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో బృందాలను ఏర్పాటు చేసింది. ఈ ఘటనలో దోషులను వదిలిపెట్టబోమని హెచ్చరించింది. ఇదిలా ఉండగా..

మిగతా 2 లో

# టెలీ సేవలు.. సూపర్ స్పెషాల్టీ వైద్యం

## ఉస్మానియా నుంచి రోగులకు టెలీ వైద్య సేవలు

## అందుబాటులో అన్ని రకాల సదుపాయాలు



**తెలంగాణ బ్యూరో,(ఆరోగ్యజ్యోతి):** పెద్దాస్పత్రులకు వెళ్లకుండానే సూపర్ స్పెషాల్టీ వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. ఎప్పటి నుంచో ఉస్మానియా ఆస్పత్రి విజయవంతంగా ఈ టెలీ సేవలను రోగులకు అందిస్తోంది. నిత్యం 100 మంది వరకు రోగులు ఈ సేవలను వినియోగించుకుంటున్నట్లు వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా బస్తీ దవాఖానాలు, అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక వైద్య సేవలు మాత్రమే అందుతున్నాయి. ఏవైనా స్పెషాలిటీ వైద్యం అవసరమైతే దూరప్రాంతాల నుంచి ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రావాల్సిందే. ఈ నేపథ్యంలో వృద్ధులు, స్త్రీలు ఇబ్బందులు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తీరా ఆస్పత్రికి వచ్చి క్యూలో నిలబడి చీటి తీసుకుని వైద్యునికి చూపించుకుని ఇంటికెళ్లే సరికి సాయంత్రం అవుతోంది. ఈ టెలీ మెడిసిన్ సేవలు అందుబాటులోకి వచ్చాక వైద్య సేవలు సులభతరం అయ్యాయి. ఇంటికి దగ్గరలోనే ఈ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది.

మిగతా 2 లో

# వైద్య అనుబంధ వృతి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

## నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి






**తెలంగాణ బ్యూరో,(ఆరోగ్యజ్యోతి):** వైద్యానికి అనుబంధంగా ఉన్న వృతి విద్య కోర్సులు కు భుజాల భవిష్యత్తు ఉందని నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి అన్నారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్ లో జరిగిన వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాలల విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ 2025 -26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ వీరప్ప నగరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మెడికల్ మెడికల్ కోర్సులకు ఎంతో డిమాండ్ ఉందని చెప్పారు భారతదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా మెడికల్ పారామెడికల్ వృతి విద్య కోర్సులకు ఎంతో గుర్తింపు ఉందని ఈ సందర్భంగా డైరెక్టర్ పేర్కొన్నారు. ఎంసెట్లో ర్యాంకు రాలేదని బాధ పడవద్దు అని దానికి అనుకూలంగా మంచి మంచి కోర్సురు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. డిగ్రీ డిప్లొమా సర్టిఫికెట్ లాంటి కోర్సులు ఎన్నో ఉన్నట్లు వివరించారు. నిమ్స్ దేశంలోనే అత్యంత ఆధునిక రోగ నిర్ధారణ యంత్ర పరికరాలు మరియు నిష్ణాతులైన సాంకేతిక సిబ్బంది, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది ఉన్నటువంటి సంస్థలో శిక్షణ పొందడం ద్వారా విశాలమైన అవకాశాలు అంది పుచ్చుకోవచ్చని పేర్కొన్నారు.మీరు మెడిసిన్లో సీటు రాలేదని బాధపడకుండా వచ్చిన అవకాశాన్నీ సద్వినియోగం చేసుకొని, ఉజ్వల భవిష్యత్ సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ ద్వారా సాంకేతిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి అని తెలిపారు.విద్యార్థులు క్రమ శిక్షణతో, పట్టుదలతో తను ఎంచుకున్న కోర్సులో సుశిక్షితులు కావాలని, సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని కోరారు. సేవారంగంలో మీకు పని చేసే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా: శాంతి వీర్, కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ దామోదర నాయుడు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.


# ప్రెగ్నెన్సీ టూర్ అంటే ఏమిటి?

## పైసలిచ్చి మరి వారితో ప్రెగ్నెన్సీ పొందడం ఎందుకు?

వెబ్ డెస్క్ : ప్రెగ్నెన్సీ టూరిజం లేదా బెర్త్ టూరిజమ్ అనేది గర్భవతులు ప్రసవం కోసం మరో దేశానికి ప్రయాణించి... ఆ దేశ చట్టాల ప్రకారం తమ బిడ్డకు పౌరసత్వం పొందేందుకు ప్రత్యేకంగా ఉద్దేశించబడింది. అనేక ప్రయోజనాలు పొందేందుకు సులభతర పద్ధతిగా పరిగణించబడుతుంది. జస్ పోలి విధానాల ప్రకారం.. ఆ దేశ ప్రాంతంలో పుట్టిన ఎవరైనా.. తల్లిదండ్రులు ఆ దేశానికి చెందిన వారు కాకపోయినా ఆటోమేటిక్ గా పౌరసత్వం లభిస్తుంది. ఉన్నత ఆరోగ్య రక్షణ, విద్యా వ్యవస్థల

మిగతా 2 లో

# వైద్య ఆరోగ్య పథకాలను పకడ్బందీగా నిర్వహించాలి


02

# ఆరోగ్యశ్రీలో 99.50లక్షల కుటుంబాలు



మొదట పేజీ తరువాయి నాడు ఒక్కో కుటుంబానికి వైద్య చికిత్సల పరిమితి రూ.2 లక్షలుగా నిర్ణయించగా.. ఉమ్మడి రాష్ట్రంలో 79 లక్షల కుటుంబాలు ఈ పథకం పరిధిలోకి వచ్చాయి. మొత్తం 120 ఎంప్యానెల్ ఆస్పత్రులు ఉండగా, ఈ పథకం కింద 533 ప్రొసీజర్లు ఉండేవి. 2012లో ఆరోగ్యశ్రీలోని ప్రొసీజర్ల సంఖ్యను 898కు పెంచగా, ఎంప్యానెల్ ఆస్పత్రుల సంఖ్య కూడా 338కి పెరిగింది. ఇక, తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీని యథాతథంగా కొనసాగించింది. 2014 నాటికి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ లబ్ధి పొందే కుటుంబాల సంఖ్య 87.5 లక్షలుగా ఉంది. 2016లో కేసీఆర్ ప్రభుత్వం మరో 91 ప్రొసీజర్లను ఆరోగ్య శ్రీలోకి చేర్చింది. బడ్జెట్‌ను సైతం రూ.423 కోట్లకు పెంచింది. ఆతర్వాత 2021 నాటికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను 1356కి పెంచడంతోపాటు మరో 3 లక్షల కుటుంబాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చింది. వైద్య చికిత్సల పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడంతోపాటు బడ్జెట్‌ను రూ.973కోట్లకు పెంచింది. ప్రొసీజర్ల సంఖ్యను 1672కు పెంచింది.

### కాంగ్రెస్ సర్కారు వచ్చాక మరిన్ని మార్పులు.

2023 చివరిలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వైద్య చికిత్సల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచారు. గత ఏడాది జూలైలో కొత్తగా మరో 163 ప్రొసీజర్లను పథకం పరిధిలోకి తెచ్చారు. దీంతో మొత్తం ప్రొసీజర్ల సంఖ్య 1835కు చేరింది. ఎంప్యానెల్ ఆస్పత్రుల సంఖ్య 1502కు పెరిగింది. అలాగే, ఆరోగ్యశ్రీ బడ్జెట్‌ను రూ.1443 కోట్లకు పెంచారు. లబ్ధి పొందే కుటుంబాల సంఖ్య 99.50 లక్షలకు చేరింది. ఇక 2022-23లో 5.59 లక్షల మంది శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. 2023-24లో 6.21 లక్షలు, 2024-25లో 6.57 లక్షలు, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 3.02లక్షల మంది వైద్య సేవలు పొందారు. పరిమితి పెంచడంతో పాటు ప్రొసీజర్లు, నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య పెంచడం వల్లే ఆరోగ్యశ్రీ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వైద్య వర్గాలు వెల్లడించాయి. అలాగే, ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస) కింద 5.46 లక్షల మంది వైద్య చికిత్సలు పొందారు.

# ప్రెగ్నెన్సీ టూర్ అంటే ఏమిటి?



మొదట పేజీ తరువాయి ప్రయోజనాలను అందిస్తుంది..ఎడ్యుకేషన్, వర్క్ వీసా, కుటుంబ ప్రయోజనాలకు సులభమైన మార్గంగా మారుతుంది. బెర్త్ టూరిజమ్.. బిడ్డ జన్మించిన దేశంతోపాటు తల్లిదండ్రులు సొంత దేశపు పాస్ పోర్టులు రెండు ఉంటాయి. డ్యూయల్ సిటిజన్ ప్ లభిస్తుంది. గ్లోబలైజేషన్, చౌకైన అంతర్జాతీయ ప్రయాణంతో ప్రెగ్నెన్సీ టూరిజమ్ పెరగ్గా... చట్టపరమైన, ఆర్థిక, నైతిక ఆందోళనల కారణంగా వివాదాస్పదంగా మారింది. అందుకే కొన్ని దేశాలు బర్త్ రైట్ పౌరసత్వాన్ని అందించేందుకు కఠిన నియమాలను తీసుకొచ్చాయి. దుర్వినియోగాన్ని కట్టడి చేసేందుకు వినియోగిస్తున్నాయి. కొన్ని దేశాలు తల్లిదండ్రులు బిడ్డ పుట్టేందుకు ముందు ఏడాదిపాటు దేశంలో జీవిస్తేనే ఈ సిటిజన్షిప్ల అందిస్తున్నాయి.

### లదాఖ్ పురుషులకు డిమాండ్..

లడాఖ్ లో ప్రెగ్నెన్సీ టూరిజమ్ భారీగా పెరుగుతుంది. ముఖ్యంగా ఇది జాతి శుద్ధతా కథనాలతో ముడిపడి ఉంది. యురోపియన్ మహిళలుముఖ్యంగా జర్మన్ కు చెందిన వారు స్థానిక పురుషుల సంతానం కోసం ప్రయాణిస్తారని తెలుస్తోంది. కారణం ఇక్కడి కమ్యూనిటీ అలెగ్జాండర్ ది గ్రేట్ సైనికుల వంశానికి చెందిన వారని సమాచారం. ఇందుకోసం ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిచబడుతాయనే కథనాలు కూడా ఉన్నాయి. డా. హాను, గార్కోన్ వంటి గ్రామాల్లో టూరిజమ్ పెరిగేందుకు ఇదే ముఖ్య కారణంగా చెప్పబడుతోంది. బ్రోక్పా కమ్యూనిటీ ఆర్యన్ వంశస్థులని.. ఫెయిర్ స్కిన్, పొడవు, అందమైన కళ్లు కలిగిన వారని.. వీరే చివరగా ఉన్న శుద్ధ ఆర్యులని చెప్పబడుతారు. ప్యూర్ ఆర్యన్ జెనెటిక్స్ పొందేందుకు బ్రోక్పా పురుషుడితో సంతానాన్ని పొందేందుకు ఇష్టపడుతున్నారు.

# వైద్య ఆరోగ్య పథకాలను పకడ్బందీగా నిర్వహించాలి





- జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ

**నిజామాబాద్,(ఆరోగ్యజ్యోతి):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఆరోగ్య పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ముందు ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని డిప్యూటీ డిఎంహెచ్వోలు, ప్రోగ్రాం అధికారులు మరియు వివిధ విభాగాల సిబ్బందినకి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ గారు వివిధ ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించడం. సీజనల్ వ్యాధులు, కీటక జనత వ్యాధులను వ్యాప్తి చెందకుండా నియంత్రించడం. డెంగీ పాజిటివ్ గుర్తించబడిన ప్రాంతాలలో దోమల లార్వా సంక్రమణ జరగకుండా టేమీఫాస్ తో స్ప్రే చేయడం, జ్వర సర్వే నిర్వహించడం, అసంక్రమిక వ్యాధులను నియంత్రణలో ఉంచి గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడం పై ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం లో భాగంగా ప్రతి టీం సంవత్సరంలో రెండు సార్లు ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని మరియు ప్రతి పాఠశాలలో విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డి ఈ ఐ సి కి రిఫర్ చేయాలన్నారు. నూతనంగా నిర్మించిన పల్లె దావకానాలన్నింటిని మీ మీ పరిధిలోని శాసనసభ్యుల సహకారంతో వాటిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీబి ముక్తభారత్ లో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను విజయవంతం చేసేలా ప్రతి ఒక్క సిబ్బంది పాల్గొనాలని, లెప్రసీ మరియు ఎయిడ్స్ లాంటి వ్యాధులకు నిరంతరం ముందస్తు పరీక్షలు నిర్వహించి వ్యాధిని గుర్తించాలన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేట్ ఆస్పత్రులన్నీ విధిగా రిజిస్ట్రేషన్, బయో మెడికల్ మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ధ్రువీకరణ పొందిన తర్వాతే ఆరోగ్య సేవలు అందించాలని అదేవిధంగా సకాలంలో రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు మరియు పిసిపి ఎన్ డి టి యాక్ట్ ప్రకారం స్కానింగ్ సెంటర్లన్నీ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదు అని ఒకవేళ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోబడతాయని స్కానింగ్ సెంటర్లను ఆసుపత్రులను నిబంధనలకు అనుగుణంగా లేనిచో వాటిని సీజ్ చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిటిసిఓ డాక్టర్ దేవీ నాగేశ్వరి, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ రమేష్,డాక్టర్ సమత, డి ఐ ఓ డాక్టర్ అశోక్ , ప్రోగ్రాం అధికారులు తుకారాం రాథోడ్,డాక్టర్ రాజు, డాక్టర్ శ్వేత,డాక్టర్ భార్గవి, డాక్టర్ వెంకటేష్ డాక్టర్ శిఖర, కోఆర్డినేటర్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీ ఎయిమ్స్ నంబర్1




మొదట పేజీ తరువాయి సాధించిన మెడికల్ కాలజీలకు ర్యాంకులు కేటాయించారు. దేశంలో మొదటి 10 స్థానాల్లో ఉన్న కళాశాలలు... 1) ఎయిమ్స్, న్యూఢిల్లీ(91.80 పాయింట్లు), 2) పిగ్మర్, చండీగఢ్(82.58), 3) సీఎంసీ, వెల్లూరు(76.48), 4) జవహర్ లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ అండ్ రీసెర్చ్, పాండిచ్చేరి(73.30), 5) సంజయ్‌గాంధీ పోస్టు గ్రాడ్యుయేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, లక్నో(70.09), 6) బెనారస్ హిందూ యూనివర్శిటీ, వారాణసి(70.05), 7. నిమ్‌హ్యాన్స్, బెంగళూరు(69.77), 8) కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీ, లక్నో(68.77), 9) అమృత విశ్వ విద్యాపీఠం, కోయంబత్తూరు(68.52), 10) కస్తూర్బా మెడికల్ కాలేజ్, మణిపాల్(68.05).

## ఆరుగురు చిన్నారుల మృతి



మొదట పేజీ తరువాయి చింద్వారాలోని పరాసియా బ్లాక్‌లో దాదాపు 15రోజుల్లో తొమ్మిది మంది పిల్లలు కోల్డ్రిఫ్ సిరప్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇంకా పలువురు చికిత్స తీసుకుంటున్నారు. ఆ సిరప్‌లో నాన్-ఫార్మాకోపోయియా-గ్రేడ్ ప్రొపైలిన్ గ్లైకాల్‌ను ఉపయోగించారని దర్యాప్తులో తేలింది. ఈ డ్రగ్ కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలైన డైథిలిన్ గ్లైకాల్ DEG, ఇథిలీన్ గ్లైకాల్‌తో కలుషితమైనట్లుగా అనుమానిస్తున్నారు. ఈ నివేదిక తర్వాత తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్రిఫ్ సిరప్ అమ్మకం, వాడకాన్ని నిషేధించింది. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో స్టాక్‌ను ఫ్రీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కంపెనీకి ఉత్పత్తిని నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. తయారీ లైసెన్స్‌ను రద్దుకు షోకాజ్ నోటీస్ పంపారు. ఈ విషయంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు.. తమిళనాడు ఎఫ్‌డీఏ తమిళనాడులోని కాంచీపురంలోని శ్రీసన్ ఫార్మా నుంచి కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ నమూనాలను సేకరించిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నమూనాల్లో డీఈజీ స్థాయి అనుమతించిన పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు తేలిందని పేర్కొంది.

## టెలీ సేవలు.. సూపర్ స్పెషాల్టీ వైద్యం

### వినియోగించుకోవడం ఎలా..?



మొదట పేజీ తరువాయి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 250 వరకు బస్తీ దవాఖానా లున్నాయి. మరో 90కి పైనే అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా రోగులకు సేవలందిస్తున్నారు. జ్వరం, జలుబు, మధుమేహం, అధిక రక్తపోటు, ఇతర చిన్నచిన్న ప్రాథమిక రుగ్మతలకు ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. ఇతర ఏమైనా పెద్ద సమస్యలుంటే ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. గ్యాస్ట్రో, ఆర్థో, ఇతర సూపర్ స్పెషాల్టీ సేవలు పొందాలంటే టెలీ మెడిసిన్ ద్వారా నేరుగా పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడి సేవలందిస్తున్నారు. బస్తీ దవాఖానాలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లోని వైద్యుని వద్ద ఉన్న ట్యాబ్ ద్వారా ఉస్మానియా టెలీమెడిసిన్ కేంద్రంతో అనుసంధానం చేసి సేవలు పొందే వీలు కల్పించారు. ముందురోజు స్లాట్ బుక్ చేసి నిపుణులు అందుబాటులో ఉండేలా చూస్తారు. రోగులు చెప్పే లక్షణాలను బట్టి అవసరమైన టెస్టులు, మందులు ఈ-సంజీవని పోర్టల్ ద్వారా సూచిస్తారు. సర్జరీలు అవసరమైతే ఉస్మానియాకు రెఫర్ చేస్తారు.

**టెలీ మెడిసిన్ ద్వారా అందే కీలక సేవలివే :** మధుమేహ సమస్యలు, అధిక రక్తపోటు, కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు, చర్మ సంబంధిత ఇబ్బందులు, జనరల్ మెడిసిన్, ఫిజియో థెరపీ, గుండె సమస్యలు, జీర్ణకోశ ఇబ్బందులు, స్త్రీలకు సంబంధించిన సమస్యలు కీలకంగా ఉన్నాయి. వీటితోపాటు మరికొన్ని రోగాలకు సైతం ఈ టెలీ మెడిసిన్ ద్వారా వైద్య సేవలందిస్తున్నారు.

# ప్రజారోగ్యం పట్టదా...!

## ప్రభుత్వ వైద్య రంగాన్ని సర్కారు పిపిపి పద్ధతిలో ప్రైవేటుకు అప్పగించాలని చూస్తోంది



**కాకినాడ,(ఆరోగ్యజ్యోతి):** ఒక వైపు ప్రభుత్వ వైద్య రంగాన్ని సర్కారు పిపిపి పద్ధతిలో ప్రైవేటుకు అప్పగించాలని చూస్తోంది. మరోవైపు ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందిస్తున్న వైద్యుల సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు రంగం వైపు ఎక్కువగా మొగ్గు చూపిస్తోంది. అందుచేతనే ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తోంది. ఈ నేపథ్యంలోనే పేద, సామాన్య వర్గాల ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సమస్యల పరిష్కారం కోసం పిహెచ్‌సిల వైద్యులు సమ్మెబాట పట్టారు. అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోని పరిస్థితుల్లో ఒపి సేవలను సైతం నిలిపివేశారు. ఇప్పటికైనా స్పందించకపోతే ఉద్యమం ఉధతం చేస్తామంటూ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాకినాడ జిల్లాలో 37 పిహెచ్‌సిలు ఉండగా అందులో 104 మంది రెగ్యులర్ వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు సుమారు 3 వేల మంది సామాన్యులు ఒపి సేవలు పొందుతున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 42 పిహెచ్‌సిలు, 102 మంది రెగ్యులర్ వైద్యులు పని చేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 41 పిహెచ్‌సిలు ఉన్నాయి. వీటిలో 82 మంది వైద్యులు పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నిత్యం వీటి ద్వారానే వైద్య సేవలు అందుతున్నాయి. సాధారణ వైద్య పరీక్షలతో బాటు మాతాశిశుఆరోగ్య సేవలు, టీకాలు వేయడం, కౌన్సెలింగ్, ఆరోగ్య విద్య, చిన్నపాటి శస్త్రచికిత్సలు, సామాజిక ఆరోగ్య కార్యకలాపాలు ఉంటాయి. ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చడమే వీటి ప్రధాన లక్ష్యం. పలు పిహెచ్‌సిలలో ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలూ కల్పించకపోయినా వైద్యులు రోగులకు సేవలు అందించడంలో ముందుంటున్నారు. కొన్నేళ్లుగా ఈ వైద్యులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. విధులేని తప్పనిసరి పరిస్థితుల్లో డాక్టర్లు ఆందోళన బాట పట్టారు.ప్రస్తుతం పిహెచ్‌సి వైద్యులు ఆందోళన బాటలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామంటూ ఈ సందర్భంగా వారు హెచ్చరిస్తున్నారు. సర్వీస్‌లో ఉన్న వైద్యులకు గతంలో 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ రిజర్వేషన్ ఉండేదని, జిఒ నంబర్ 85 ద్వారా ఈ కోటాను 15, 30 శాతానికి కుదించివేయడం తగదని డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం జిఒ 99 ద్వారా ఆరు బ్రాంచిల నిబంధన తీసుకుని వచ్చిందన్నారు.దీని ప్రకారం, 15 శాతానికి కుదించిన క్లినికల్ సీట్ల రిజర్వేషన్ రేడియాలజీ, మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్థీషియా బ్రాంచీలకు మాత్రమే వర్తింపజేసిందని తెలిపారు. దీనిపై తామంతా గత కాలంగా ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు. ఎంబిబిఎస్ చదివి వైద్యాధికారిగా నియమితులైన వారు పీజీ చదువుకోవడానికి ప్రభుత్వం అనేక షరతులు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.50 లక్షల ష్యూరిటీ ఇవ్వాలని, కనీసం పదేళ్ల ప్రభుత్వ సర్వీసులో అదే హొదాలో పని చేస్తామంటూ బాండ్ రాయాలని చెబుతోందని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన బాటపెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఎపి పిహెచ్‌సి వైద్యుల సంఘం పిలుపు మేరకు వైద్యులు తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె బాట పట్టారు. దీన్ని దశలవారీగా నిర్వహించనున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. ఆందోళనలో భాగంగా రెండు రోజులు నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలిగారు. సోమవారం నుంచి ఒపి సేవలను బహిష్కరించారు. బుధవారం జిల్లా కేంద్రం కాకినాడ డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. 2న విజయవాడకు దీక్షా యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే 3న నిరాహార దీక్షలు చేపడతామని వైద్యులు హెచ్చరించారు.

# గురుకులంలో కలవరం

## కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ

- అందరికీ జాండీస్ లక్షణాలు
- జిల్లా కేంద్రాసుపత్రిలో 58 మందికి చికిత్స
- కురుపాం, సాలూరు ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు
- ఇద్దరిని విశాఖ కేజీహెచ్‌కు తరలింపు
- మిగిలిన బాలికలందరికీ రక్త పరీక్షలు
- రాష్ట్ర వైద్య బృందం పరిశీలన



**పార్వతీపురం,(ఆరోగ్యజ్యోతి):** కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు పచ్చకామెర్ల లక్షణాలతో అస్వస్థతకు గురికావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఇద్దరు బాలికలు మృతి చెందగా.. మరోవైపు రోజురోజుకూ ఆసుపత్రుల్లో చేరిన విద్యార్థినుల సంఖ్య పెరుగుతుండడం కలకలం రేపుతోంది. ఒకే పాఠశాలకు చెందిన వారు ఇలా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంపై కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆ పాఠశాలలో చదువుతన్న 611 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. అదే విధంగా ఇన్‌పేషెంట్లుగా చేరిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

### విస్తృతంగా వైద్య సేవలు

దసరా సెలవులు ఇచ్చిన తర్వాత ఈ పాఠశాల విద్యార్థినులు స్వగ్రామాలకు వెళ్లారు. అలా వెళ్లిన వారిలో గుమ్మలక్ష్మీపురం మండలం కంబగూడ గ్రామానికి చెందిన పువ్వల అంజలి జాండీస్ లక్షణాలతో గతనెల 26న మృతి చెందింది. ఈ నెల ఒకటో తేదీన కురుపాం మండలం దండుసూర గ్రామానికి చెందిన తోయక కల్పన విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించింది. మరికొందరు విద్యార్థినులు పచ్చ కామెర్ల లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రంగంలోకి దిగింది. దసరా సెలవుల నిమిత్తం ఇళ్లకు వెళ్లిన ఆ పాఠశాల విద్యార్థినుల వద్దకు వైద్య సిబ్బంది వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. శుక్రవారం వాటిని పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. సాలూరు, కురుపాం సీహెచ్‌సీల్లోనూ విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాకేంద్రాసుపత్రిలో 50 మంది విద్యార్థినులు చికిత్స పొందుతుండగా.. వారిలో టెన్త్, ఇంటర్ చదువుతున్న హిమరిక షర్మిల, ఎం.అనిత పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వారిలో ముగ్గురు ఏకలవ్య పాఠశాల విద్యార్థినులున్నారు. మరోవైపు ప్రిన్సిపాల్ అనురాధను సస్పెండ్ చేస్తూ గురుకుల కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

### బాలికల ఆరోగ్య పరిస్థితిపై ఆరా

జిల్లాకేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను శుక్రవారం కలెక్టర్ పరామర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాలికలకు పూర్తిగా నయమైన తర్వాతే డిశ్చార్జి ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ‘ కురుపాం పాఠశాలకు చెందిన విద్యార్థినులు దసరా సెలవుల నిమిత్తం ఇళ్లకు వెళ్లిన తర్వాత వారిలో పచ్చకామెర్లు లక్షణాలు ఉన్నట్టు రక్త పరీక్షల ద్వారా గుర్తించాం. కొంతమందిని జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. 50 మంది విద్యార్థినులు చికిత్స పొందుతున్నారు. ఇందులో 20 మంది పూర్తిస్థాయిలో కోలుకుం టున్నారు. వారిలో ఇద్దరు విద్యార్థినులకు కేజీహెచ్‌కు రిఫెర్ చేశాం. మిగిలిన బాలికలు ఇంటిలో ఉన్నా లేదా హాస్టల్ ఉన్నా వారికి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి, పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించాం. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలను తెలుసుకోవడానికి రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఆ ప్రాంతానికి పంపించాం. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. మరోవైపు రాష్ట్ర వైద్య బృందం కూడా పాఠశాలకు వెళ్లింది. ఆహార పదార్థాలు, తాగునీటి శాంపుల్స్‌ను సేకరించింది. త్వరలోనే నివేదికలు అందించనున్నారు. ఇంకా ఎవరైనా బాలికలు అనారోగ్యంతో బాధపడుతుంటేవారిని తల్లిదండ్రులు సమీప ఆసుపత్రికి తరలించాలి.’ నాటు వైద్యం ప్రమాదకరం. అత్యవసర సమయాల్లో సీహెచ్‌సీ, పీహెచ్‌సీల ద్వారా వైద్య సేవలు పొందాలి. ఆర్ఎంపీలు, నాటు వైద్యుల వద్దకు వెళ్లరాదు. అంబులెన్స్‌లతో పాటు ఐటీడీఏల నుంచి కూడా ప్రత్యేక వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చాం.’ అని తెలిపారు. ఆయన వెంట జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి , డీసీహెచ్ఎస్ నాగభూషణరావు, సూపరింటెండెంట్ నాగశివజ్యోతి, చిన్న పిల్లల వైద్య నిపుణుడు గణేష్ చైతన్య తదితరులు ఉన్నారు.

### కురుపాంలో ప్రత్యేక వైద్య పరీక్షలు

...డీఎంహెచ్‌వో భాస్కరరావు పర్యవేక్షణలో కురపాంలో విద్యార్థినులకు శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. బాలికల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి ఆ పాఠశాలకు చేరుకుని విద్యార్థినులు, తల్లిదండ్రులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవలపై డీఎంహెచ్‌వోతో చర్చించారు. బాలికలతో సహా తల్లిదండ్రులందరూ రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సెలవుల్లో ఇంటికి వెళ్లిన విద్యార్థినులు సరైన వైద్యం చేయించుకోపవడం వల్లే ఇలా జరిగిందని తెలిపారు. శుక్రవారం ఎనిమిది మందిని కురుపాం ఆసుపత్రి నుంచి పార్వతీపురం జిల్లా ఆసుపత్రి పంపించామన్నారు. పాఠశాలకు కొత్త ఆర్‌వో ప్లాంట్ కోనుగోలు చేశామని వెల్లడించారు.

– కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థినులు పచ్చకామెర్లతో బాధపడుతున్నట్లు వైదులు నిర్ధారించారు. శుక్రవారం విజయవాడ నుంచి వచ్చిన ముగ్గురి వైద్యులతో పాటు విజయనగం మెడికల్ కళాశాలకు చెందిన నాలుగురు డాక్టర్ల బృందం పాఠశాలను పరిశీలించింది. కురుపాం ఆసుపత్రిలో డాక్టర్లతో మాట్లాడారు. కలుషిత నీరే కారణమని ప్రాథమికంగా అంచనా వేశారు.

### యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం

‘కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినుల్లో కొంతమంది పచ్చకామెర్లతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని.. వెంటనే కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడాం. జిల్లా అధికార యంత్రాంగాన్ని అమ్రపత్తం చేశాం. ఇప్పటికే ఇద్దరు బాలికలు పచ్చకామెర్ల లక్షణాలతో మృతి చెందడం బాధాకరం. మరికొంతమంది జాండీస్‌తో బాధపడుతుండడంతో వైద్య సిబ్బంది బాలికలందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర వైద్య బృందం ఆ పాఠశాలను సందర్శించింది. త్వరలోనే నివేదిక అందించనుంది. దసరా సెలవుల నిమిత్తం ఇళ్లకు వెళ్లిన బాలికలు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలు తెలుసుకొని అవసరమైన చర్యలు తీసుకుంటాం. ముందుగా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశాం. ’ అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

# అన్నదానంలో అపశృతి..

## గంజి మీద పడి 16 మంది చిన్నారులకు గాయాలు



**అమరావతి,(ఆరోగ్యజ్యోతి):** దుర్గాదేవి మండపం వద్ద నిర్వహించిన అన్నదానం లో అపశృతి దొర్లింది. ప్రమాదవశాత్తు అన్నం గంజి మీద పడి 16 మంది చిన్నారులతో పాటు మహిళలకు గాయాలయ్యాయి. విశాఖ జిల్లా జాలరిపేట పిల్లా అన్నమ్మయ్య సంఘం వద్ద దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. శనివారం అన్నదానం నిర్వహించగా అక్కడికి వచ్చిన పిల్లలు, మహిళలపై ప్రమాదవశాత్తు వారిపై గంజి పడింది.దీంతో వారికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వెంటనే విశాఖలో కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే వంశీకృష్ణ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ ప్రమాదంలో 6 గురికి తీవ్ర గాయాలు కాగా వారిని ఆసుపత్రిలో చికిత్స అందించి మిగతా వారికి చికిత్స అనంతరం వారివారి ఇళ్లకు పంపించారు. ఎన్టీఆర్ వైద్యసేవాల ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ గాయపడ్డ చిన్నారునలు పరామర్శించారు.

# వైద్యుల నిర్లక్ష్యం....

## యువతి కాలులో సీసా పెంకులు



**ఖమ్మం, చుంచుపల్లి ,(ఆరోగ్యజ్యోతి):** యువతి కాలులో సీస పెంకులు ఉండగానే కుట్లు వేసిన సంఘటన కొత్తగూడెం జిల్లా పరిధి చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రామవరంకు చెందిన సలిగంటి కవిత అనే యువతి తన కాలులో సీన పెంకులు గుచ్చుకున్నాయని, పది రోజుల క్రితం కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళింది..ఈ తరుణంలోనే, కాలులో ఒక సీసం వెంకు ఉందని బయటికి తీసి, ఏడు కుట్లు వేసి ఇంటికి పంపించేశారు. అయినా కానీ నొప్పి తగ్గకపోవడంతో యువతి మరల వైద్యులను సంప్రదించారు. దీంతో వారు క్షుణ్ణంగా పరిశీలించి ఇంకా ఆరు సీస పెంకులను బయటికి తీశారు. ఇది చూసిన వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. అంతేకాదు, కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తీరుపై సదరు యువతి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# డాక్టర్ వృత్తి దైవంతో సమానం

## కే బ్రహ్మయ్య

**మహబూబ్ నగర్,(ఆరోగ్యజ్యోతి):** డాక్టర్ వృత్తి దైవంతో సమానమని.. వైద్య సేవలతో ప్రాణాలు కాపాడడం,బాధలను తగ్గించడం, జీవిత నాణ్యత ను మెరుగు పరచడం తో దేవుడితో పోలుస్తారని ఆచార్య జయశంకర్ విశ్వకర్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బ్రహ్మయ్య అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ధన్వాడ శ్రీనివాసులు, ప్రవీణ ల కుమార్తె హర్షిత ఎంబీబీఎస్ ‘పీజీ నీట్’ లో రాష్ట్రవ్యాప్త 60 వ ర్యాంకు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో కుమారి హర్షిత ను శాలువా పుష్పగుచ్చం తో సన్మానించి మాట్లాడారు. డాక్టర్ వృత్తిలో రోగులను సుహృద్భావం, మనోధైర్యం, స్నేహపూర్వక పలకరింపుతో వైద్యం చేస్తే సగం రోగం నయమవుతుందని, డాక్టర్ గా మంచి పేరు సంపాదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మాచారీ, అంజయ్యాచారి, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ కోర్సుల దరఖాస్తు గడువు పెంపు

**తెలంగాణ బ్యూరో,(ఆరోగ్యజ్యోతి):** కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం (కేఎస్ఆర్యూహెచ్ఎస్) అండర్ గ్రాడ్యుయేట్ ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును పొడిగించింది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ అనుబంధ కళాశాలల్లోని బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్ వైఎస్ కోర్సుల్లో స్టేట్ కోటా కింద, ప్రైవేట్ హెూమియోపతి కళాశాలల్లోని బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ఆల్ ఇండియా కోటా కింద ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ అవకాశం కల్పించారు. యూనివర్సిటీ గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం చివరి తేదీ గత నెల 29 కాగా.. ఇప్పుడు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ల గడువును అక్టోబర్ 8 రాత్రి 11:30 గంటల వరకు పొడిగించినట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# వ్యాధులపై అవగాహన కల్పించాలి



**అదిలాబాద్, భీంపూర్, (ఆరోగ్యజ్యోతి):** ప్రజలకు వర్షాకాలం వచ్చే వ్యాధులు తోపాటు దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ మండల ఆరోగ్య విస్తీర్ణ అధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్ తెలిపారు మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భీంపూర్ పరిధిలోని కామాట్వాడ,కరంజి (గుబిడి),భీంపూర్ (డబ్బకుర్చి), అట్నంగూడ,జెల్కోరి,భగవాన్పూర్ గ్రామాలలో గర్భిణీ స్త్రీలకు, శిశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వైద్యాధికారి డా “ టి.నిఖిల్ రాజ్ తెలిపారు ఈకార్యక్రమంలో పర్యవేక్షకులు రూహిదాస్, మేఘ హెల్త్ వెల్నెస్ సెంటర్ల సిబ్బంది పాల్గొన్నారు

# నిమ్స్ ప్రొఫెసర్ వీల్ చైర్ల వితరణ



**తెలంగాణ బ్యూరో,(ఆరోగ్యజ్యోతి):** నిజం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో ఫార్మాకలోజీ విభాగ అధిపతిగా పనిచేసిన డాక్టర్ పి ఉషారాణి పదవి విరమణ పొందిన అనంతరం నిమ్స్ ఆసుపత్రికి ఐదు వీల్చీర్లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ నిమ్స్ కు వచ్చే రోగులకు ఉపయోగపడే విధంగా వీల్ చైర్లు ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. పదవి విరమణ పొందిన అనంతరం రోగులకు ఏ విధంగానైనా సేవ చేయాలనే ఉద్దేశంతో ఐదు వీరు పేర్లను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. రాబోయే రోజుల్లో నేమ్స్ కళాశాలకు అనుబంధ ఆసుపత్రికి ఏదైనా ఒక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పదిమందికి ఉపయోగపడే పని చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి తెలిపారు. ఐదు వీలు చైర్లు పంపిణీ చేసినందుకుగాను నిజం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ఉషారాణికి కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రికి చాలా పెద్దదని కొన్ని సందర్భాల్లో రకరకాల వస్తువులు అవసరమవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పెళ్లి రోజు కానీ పుట్టినరోజు ఇతర శుభకార్య సందర్భంగా నిమ్స్ ఆసుపత్రికి ఏదైనా డొనేట్ చేయవచ్చని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు ఇతరులు కూడా డొనేట్ చేయవచ్చని ఈ సందర్భంగా నిమ్స్ సూపర్ బీరప్ప తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్,అసిస్టెంట్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ చరణ్, ఆర్ ఎం ఓ సల్మాన్తో, డాక్టర్. పద్మజతో పాటు పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శిరం దాస్ శ్రీనివాసులు మరియు ఫార్మకాలజీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు

# పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

## డిఎంహెచ్ఒ గీతాభాయి

**నరసాపురం,(ఆరోగ్యజ్యోతి):** పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని డిఎంహెచ్ఒ గీతాభాయి అన్నారు. తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తొలుత పిహెచ్సిలోని మందులు, ఓపి, ఐపి వివరాలు, ల్యాబ్, స్టాఫ్ రూమును, పలు విభాగాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టి పరిశీలించారు. ఆస్పత్రిని పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలని సూచించారు. సిబ్బందికి సంబంధించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులతో డిఎంహెచ్ఒ మాట్లాడుతూ సదుపాయాలు ఎలా ఉన్నాయి, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, మీకు అవసరమైన మందులు ఇస్తున్నారా వంటి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ కాన్పులు, ఇతర అత్యవసర కేసులను సిహెచ్సికి తరలించాలని సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఉన్నందున అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ కె.శ్రీనివాసరావు, హెచ్వి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# దగ్గు మందు మరణాలపై రాజస్థాన్ ప్రభుత్వం చర్యలు..

## డ్రగ్ కంట్రోలర్ సస్పెండ్

**జైపూర్,(ఆరోగ్యజ్యోతి):** దగ్గు మందు వల్ల పిల్లలు మరణించినట్లు వచ్చిన ఆరోపణలపై రాజస్థాన్ ప్రభుత్వం స్పందించింది. ఆ రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్ను సస్పెండ్ చేసింది. అలాగే జైపూర్కు చెందిన కేసన్స్ ఫార్మా తయారు చేసిన 19 మందుల పంపిణీని నిలిపివేసింది. డెక్స్ట్రోమెథోర్ఫాన్ కలిగిన అన్ని ఇతర దగ్గు సిరప్ల పంపిణీని కూడా నిలిపివేసినట్లు ఆరోగ్య శాఖ తెలిసింది. ఔషధ ప్రమాణాలను నిర్ణయించే ప్రక్రియను ప్రభావితం చేశారనే ఆరోపణలపై డ్రగ్ కంట్రోలర్ రాజారాం శర్మను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని ఆ శాఖ వెల్లడించింది.కాగా, దగ్గు సిరప్ వల్ల మధ్యప్రదేశ్లో తొమ్మిది మంది, రాజస్థాన్లో ఇద్దరు పిల్లలు చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. దీంతో రాజస్థాన్ సీఎం భజన్లాల్ శర్మ స్పందించారు. దీనిపై వివరణాత్మక దర్యాప్తు, సమర్థవంతమైన చర్యలను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య మంత్రి గజేంద్ర సింగ్ సూచనలతో దర్యాప్తు కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికార ప్రకటనలో పేర్కొన్నారు.

# రిమ్స్ దుకాణాలకు ఫైన్ వేసిన మున్సిపల్ కమిషనర్



**అదిలాబాద్, (ఆరోగ్యజ్యోతి):** రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ జనరల్ ఆస్పత్రిలో గల దుకాణం కి వెయ్యి రూపాయల ఫైన్ వేశారు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సి వి ఎన్ రాజు. జిల్లా కలెక్టర్ రాజర్షి షాశనివారం రోజు ఆకస్మికంగా రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో గల మెడికల్ షాప్ కు ఇతర దుకాణాలను తనిఖీ చేశారు. ఒకరు విజయ డైరీ లో అమ్ముతున్న ధరల గురించి కలెక్టర్కు వివరించారు. ఎమ్మార్పీ ఒక ధర ఉంటే ఇంకొక ధరకు అమ్ముతున్నారని కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేసినారు. వెంటనే ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సి వి ఎన్ రాజు వచ్చి విజయ డైరీ వారికి ₹1000 వేసినారు. అనంతరం రిమ్స్ ఆవరణలో కల హోటల్ లోని పరిసరాలను పరిశీలించారు. హోటల్లో పరిశుభ్రత పాటించాలని చెత్తాచెదారం లేకుండా చూడాలని కమిషనర్ సూచించారు.

# ఎంబీబీఎస్, బీడీఎస్ మేనేజ్మెంట్ కోట సెకండ్ ఫేజ్ కౌన్సిలింగ్ షురూ




**తెలంగాణ బ్యూరో,(ఆరోగ్యజ్యోతి):** కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం (కేఎస్ఆర్యూహెచ్ఎస్) 2025-26 విద్యా సంవత్సరానికి గాను మేనేజ్మెంట్ కోటా (బీ, సీ కేటగిరీ) కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సెకండ్ ఫేజ్ కౌన్సిలింగ్ వెబ్ ఆప్షన్ల నోటిఫికేషన్ ను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 4, 2025న మధ్యాహ్నం 3:00 గంటల నుండి అక్టోబర్ 6, 2025న మధ్యాహ్నం 1:00 గంటల వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ తెలిపింది. అభ్యర్థులు https://tspvtmedadm.tsche.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో ఆప్షన్లను వినియోగించుకోవాలి. సెప్టెంబర్ 22, 2025న కేఎన్ఆర్ యూహెచ్ఎస్ వెబ్సైట్లో విడుదల చేసిన ఫైనల్ మెరిట్ జాబితాలో పేరు ఉన్న అభ్యర్థులు మాత్రమే వెబ్ ఆప్షన్లకు అర్హులు. మొదటి దశ కౌన్సెలింగ్లో ఎంబీబీఎస్ సీటు పొంది, కళాశాలలో చేరి కొనసాగుతున్న అభ్యర్థులు కూడా ఈ దశలో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడానికి అర్హులు.అయితే, మొదటి దశలో సీటు కేటాయించినా రిపోర్ట్ చేయని లేదా కోర్సును నిలిపివేసిన అభ్యర్థులు, అలాగే మొదటి దశలో వెబ్ ఆప్షన్లు ఇవ్వని అభ్యర్థులు ఈ రెండో దశ కౌన్సెలింగ్కు అనర్హులు. సీటు పొందిన అభ్యర్థులు ఆన్లైన్లో పేమెంట్ గేట్వే ద్వారా యూనివర్సిటీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎంబీబీఎస్ కు బీ కేటగిరీ అభ్యర్థులు రూ. 40,000, సీ, ఎన్ఆర కేటగిరీ అభ్యర్థులు రూ. 70,000 చెల్లించాలి. ఈ ఫీజు చెల్లించిన తర్వాత అలాట్మెంట్ ఆర్డర్ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న ఏ కోర్సు, కళాశాలకైనా, ఎన్నింటికైనా ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఈ దశలో సీటు కేటాయించబడితే, మొదటి దశలో కేటాయించబడిన సీటు ఆటోమేటిక్గా రద్దవుతుంది. అభ్యర్థులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ఆప్షన్లు ఎంచుకోవాలి. సీటు కేటాయించిన అభ్యర్థి, అలాట్మెంట్ ఆర్డర్లో పేర్కొన్న చివరి తేదీలోగా కళాశాలలో చేరకపోతే, వారి అడ్మిషన్ ఆటోమేటిక్గా రద్దవుతుంది. అటువంటి అభ్యర్థులకు సీటు బ్లాకింగ్ను నివారించడానికి తదుపరి రౌండ్లలో అవకాశం ఇవ్వబడదు. http://knruhs.telangana.gov.in ఎంబీబీఎస్ 413, బీడీఎస్ 128 సీట్లు తెలంగాణలోని ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో మేనేజ్మెంట్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు సంబంధించిన ఖాళీల వివరాలు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఈ వివరాల ప్రకారం రెండో దశ కౌన్సెలింగ్కు గాను ఎంబీబీఎస్ కోర్సులో 413 సీట్లు, బీడీఎస్. కోర్సులో 128 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం కలిపి 526 సీట్లు ఈ దశలో భర్తీకి అందుబాటులో ఉన్నాయని విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది. ఎంబీబీఎస్ లోకల్ కోటా 199, అన్ రిజర్వ్ డ్ 111, ఎన్ఆర (సీ కేటగిరీ) 113 సీట్లు ఉన్నాయి. ఇక బీడీఎస్ బీ కేటగిరీలో లోకల్ 76, అన్ రిజర్వ్ డ్ 23, ఎస్ఆర్ఎ కోటా 29 మొతం కలిపి 128 బీడీఎస్ సీటు ఖాళీలుగా ఉన్నాయి.

## అడ్మిషన్లలో మెరిట్ జాబితా సవరణ

కాళోజి నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎస్ఆర్ హెచ్ఎస్ఈరీ) మేనేజ్మెంట్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల 2025-26 విద్యాసంవత్సర ప్రవేశాల కోసం విడుదల చేసిన మెరిట్ జాబితాలో సవరణ చేసింది. ఎన్.ఆర్.ఐ కేటగిరీపై అభ్యర్థులు సమర్పించిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం 50 మంది విద్యార్థులను అర్హులుగా ప్రకటించింది. విశ్వవిద్యాలయం ఈ మేరకు శనివారం జాబితాను విడుదల చేస్తూ, ప్రవేశాల కోసం సంబంధిత మార్గదర్శకాలను అనుసరించాలని అభ్యర్థులకు సూచించింది.

# కార్మికుల ఆరోగ్యానికి ఏదీ భరోసా?

- పట్టించుకోని సింగరేణి యాజమాన్యం
- పని స్థలాల్లో అంబులెన్స్లు కరువు
- డిస్పెన్సరీలు, ఏరియా దవాఖానలకే పరిమితం
- ప్రతీ పని స్థలంలో ఏర్పాటు చేయాలంటున్న కార్మికులు



**పెద్దపల్లి,(ఆరోగ్యజ్యోతి):** పుడమి తల్లి ఒడిలో పనిచేస్తూ నల్లబంగారాన్ని వెలికి తీసే నల్లసూర్యుల ఆరోగ్యంపై సింగరేణి యాజమాన్యం ఏమాత్రం జాగ్రత్తలు తీసుకోవడం లేదు. నిరంతరం శ్రమిస్తూ సింగరేణికి సిరులు కురిపిస్తున్న కార్మికులను పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రి, మంత్రులు దేశ, విదేశీ, నియోజకవర్గాల్లో పర్యటనలకు రూ. కోట్లాది ఖర్చు చేస్తూ వారి ప్రసన్నం కోసం ప్రాయాసపడుతున్నది. సంస్థకు సంబంధం లేని గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు సైతం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నది.కానీ, ప్రాణాలను పణంగా పెట్టి తమ స్వేదాన్ని చిందిస్తూ కోట్లాది రూపాయల లాభాలను కురిపిస్తున్న కార్మికులను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నది. కార్మికుల ప్రాణాలు పోతే మా కేం..వారి ఝితీ వచ్చే లాభాలే ముఖ్యం అనే రీతిలో సింగరేణి యాజమాన్యం, తెలంగాణ ప్రభుత్వం ప్రవర్తిస్తున్నది. వందల కోట్లు వృథా చేస్తూ, వేల కోట్ల బకాయిలు వసూళ్లు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న యాజమాన్యం మూ డు కోట్లు ఖర్చు చేసి పని స్థలాల్లో అంబులెన్స్లను ఏర్పాటు చేయాలనే ఆలోచన చేయకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది.రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ఉన్న సింగరేణి.. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల్లో 22 భూగర్భ గనులు, 19 ఉపరితల గనులు మొత్తంగా 41 గనులను కలిగి ఉంది. 41 వేల మంది పర్మినెంట్ కార్మికులు, 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు సంస్థలో పనిచేస్తున్నారు. రాష్ట్రంలో సమాంతర ప్రభుత్వంగా 71 వేల కుటుంబాలతో అనుసంధానమైన సింగరేణి యాజమాన్యం ప్రకృతికి విరుద్ధంగా.. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల ప్రమాదాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది.రాష్ట్ర వ్యాప్తంగా 7 ఏరియా దవాఖానలు 22 డిస్పెన్సరీలతో వైద్య సేవలను అందిస్తున్నది. సింగరేణి ఏరియాల్లో కాలనీల్లోని ప్రజలకు, సింగరేణి భూగర్భ, ఓపెన్ కాస్టు గనుల్లో పనిచేస్తున్న 71 వేల మంది కార్మికులకు కేవలం 67 అంబులెన్స్లను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఇందులో సగానికిపైగా శిథిలమైపోయాయి. వాటి స్థానంలో కొత్తవి తీసుకురావడంలో జాప్యం చేయడంతోపాటు అవసరమైనన్ని తీసుకురావడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది. నిత్యం ప్రమాదాల మధ్యే కార్మికులు పనిచేస్తున్నా పని ప్రదేశాల్లో ఒక్క అంబులెన్స్ కూడా అందుబాటులో లేదు.రామగుండం రీజియన్ పరిధిలోని ఆర్జీ-1, ఆర్జీ-2, ఆర్జీ-3ల పరిధిలో ఓసీపీ-3, 7 ఎల్పీ, ఓసీపీ-5, వకీల్పల్లి, ఓసీపీ-1, ఓసీపీ-2 ఎఫ్ 2, అడ్ర్యాల లాంగ్వాల్(ఏఎల్పీ), 10ఏ, 11ఇట్కంక్లైన్లు, 8 వరకు సీఎస్పీలు ఉన్నాయి. వీటి పరిధిలో 11 ఇట్కంక్లైన్ మినహా ఎక్కడా ఒక్క అంబులెన్స్ కూడా అందుబాటులో లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే పని స్థలానికి అంబులెన్స్ రావడానికి కనీసం గంట పట్టే అవకాశం ఉంది. గనులు, ఓపెన్ కాస్టుల్లో సీహెచ్పీల వద్ద ఏదైనా బొగ్గు పెల్లలు పడి ప్రమాదాలు జరిగితే అంబులెన్స్ వచ్చేలోగా కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం తమ ప్రాణాలను పట్టించుకోవాలని ప్రతి భూగర్భ, ఓసీపీ, సీహెచ్పీల వద్ద అంబులెన్స్లను ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

# రోగులకు వైద్య సేవలు అందించడంలో ముందుండాలి



- అన్ని వాళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్
- ఐ సి ఎం ఆర్ రిమ్స్ పనితీరుపై పరిశీలన
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్,(ఆరోగ్యజ్యోతి):** రాజీవ్ గాంధీ ఇనిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ జనరల్ ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని రకాల వైద్య సేవలు అందించడంలో వైద్యులు ముందుండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం రోజు జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా రిమ్స్ ఆస్పత్రి ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐ సి ఎం ఆర్, రిమ్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ ప్రాజెక్టు కింద పనిచేస్తున్న నర్సులు వైద్యులను అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలని తెలిపారు. రిమ్స్ ఆస్పత్రి అనేది జిల్లాలో పెద్ద ఆస్పత్రి అని ఇక్కడికి ప్రతి ఒక్కరు వస్తారని తెలిపారు అంతేకాకుండా నిర్మల్ ఆసిఫాబాద్ తోపాటు మహారాష్ట్రలో నుండి వైద్యం కోసం రోగులు వస్తారని అలాంటి రోగులకు వైద్య సేవలు అందించడంలో ముందుండాలని తెలిపారు. ముఖ్యంగా ఆస్పత్రి కి డెలివరీ కొరకు ఎక్కువ మంది వస్తున్నారని వారికి అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని తెలిపారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రపాలు తాగించాలని అప్పుడే శిశువు బలంగా ఉంటాడని తెలిపారు. అయితే ప్రసూతి వారిలో కొందరు మహిళలను కలెక్టర్ అడగగా కొందరు ముర్రపాలు తాగిపించామని, కొందరు తాగించలేదని సమాధానం చెప్పినట్టు కలెక్టర్ వివరించారు. వీటిపై అవగాహన కల్పించాలని వైద్యులకు మరియు సిబ్బందికి సూచించారు. ప్రసూతి కోసం వచ్చే మహిళలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రసూతి నిమిత్తం వచ్చే మహిళ ఎప్పుడు అడ్మిట్ అయింది.. డెలివరీ కొరకు ఎన్ని రోజులు సమయం పడుతుంది%ా% నార్మల్ డెలివరీ అవుతుందా లేక సిజరిన్ చేయాలా అనే తదితర విషయాలను పేరు రిజిస్టర్ లో ఎంట్రీ చేయడంతో పాటు ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షల నిర్వహించి కేసు ఏ విధంగా ఉంది. ఐ రిస్క్ లో ఉందా లేక నార్మల్ గా ఉందా అనే దానిపై పరిశీలించిన తర్వాత వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఐరిస్క్ లో ఉన్న వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా గైనకాలజీ వైద్యులకు సూచించారు. శిశువు జన్మించిన అనంతరం కూడా పూర్తి పరీక్షలు చేసిన తర్వాత నార్మల్ గా ఉందా అనే దాన్ని పరిశీలించే రికార్డులు పూర్తి రిపోర్ట్ రాయాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణ ముఖ్యమని తెలిపారు. ప్రతినెల రివ్యూ చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని రకాల రికార్డును ఎప్పటికప్పుడు పరిశీలించాలని డైరెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఇన్చార్జ్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సాధన, డాక్టర్ కౌస్తుభ తదితరులు పాల్గొన్నారు.

Printed. Published and Owned by KADAM NARESH, Printed at Krishna sai printers Adilabad (TS) place of Publicationadilabad cell no9848025451
Editor K.Naresh H No4-104 Dasnapur Ramnagar Quarters Adilabad-504001 TS RNI No TELTEL/2014/58191